# దాడి

నేను నల్లగ తారు డ్రమ్ములాగ వున్నా... చదువులో టాపర్ని! ఎం.బి.ఏ. చేసి ఇంటర్నేషనల్ కంపెనీలో లక్షా ఎనభైవేల జీతం మీద జాయినైనాను. ఇది చాలదన్నట్టు కంపెనీ నాకో విల్లా ముచ్చటైన కారు ఫ్రీగ ప్రొవైడ్ చేయటం నా లక్!. సో ఏడాది తిరక్కుండానే బ్యాంకు బేలన్స్ బోలెడుంది నా అకౌంట్లో !

పెళ్లికావటం లేదనే దిగులు ఒక్కటే అనుక్షణం నన్ను కుంగతీస్తూండేది. నేను ఏ ఆడపిల్లకూ నచ్చకపోవటమే ప్రబల కారణమని నాకు తెల్సు ! బట్... నే చేయగలిగిందేమీ లేదు. నాకు కాబోయే శ్రీమతి భూమ్మీ ఎక్కడో అక్కడ ఆ దేవుడు పుట్టించి వుండకపోతాడాని పాజిటివ్ థింకింగ్‌లో వుంటూ వస్తున్నాను.

షుమారు ఓ యాభైమంది ఆడపిల్లలను పెళ్లి చూపులనే పేరుతో చూచి వుంటాను. నా స్టేటస్ ఎర్నింగ్ స్టైల్ ఆఫ్ లివింగ్ అవీ నచ్చేవి ఒక్క నేను తప్ప!. అసలు ఆడపిల్లలకు తనెందుకు నచ్చటంలేదు? కారణం ఏమైవుంటుందని సీరియస్‌గ చాలాసార్లు ఆలోచించాను. కానీ.. నాప్రశ్నకు జవాబు దొరకటంలేదు.

మగపిల్లవాడికి ఆడపిల్ల నచ్చనట్టే... అమ్మాయిలకీ నేను నచ్చటం లేదు కాబోలు ! అసలీ నచ్చటమంటే ఏమిటి? - ఇదొక 'డర్టీ' క్వశ్చన్ అన్పించింది.

నా పసితనంలోనే మమ్మీ డాడీ యాక్సిడెంట్లో చనిపోవటంతో మేనత్త నన్ను పెంచి పెద్ద చేసింది. ఆమెకు భర్త లేడు. పిల్లలూ లేరు. నడివయసులో... ఐమీన్ పెళ్లయిన పదేళ్లకే కాన్సర్ వ్యాధితో మా అంకుల్ చనిపోయాడు. కోట్ల ఆస్తి ఆంటీ పరమైంది. నన్ను అతిగారాబంగ పెంచింది.

ఆంటీకి నేనంటే అప్పటికి ఇప్పటికే కాదు. ఎప్పటికీ కొండంత ప్రేమ !. నేను నల్లటివాడినని ఏడిపిస్తూవుండేది. కాస్త ఎదిగేక నిన్కెవరు పెళ్లిచేసుకుంటార్రా అని ఆటపట్టిస్తూండేది.

నా ఆకారం వికారంలాగుంటుందని స్కూల్లో ఫ్రెండ్సంతా ఏడిపిస్తూ ఎగతాళి చేస్తున్నా నేను వాళ్ల కామెంట్స్ కేర్ చేసేవాడిని కాదు. నన్ను వాళ్లతోపాటు ఆడనిచ్చేవారు కాదు. వెలేసినట్టు చూసేవారు. వారి దృష్టిలో నేనొక అంటరానివాడిని!

ఒరేవ్... నువ్వు నేరేడు పండులావున్నావ్... కాదు కాదు... గున్న ఏనుగాలావున్నావ్.. వినాయకచవితి నాడు వీడికి తొండం తగిలించి వీడికే గణపతి పూ. చేస్తే బాగుంటుంది కదూ?... అనేసి ఫ్రెండ్స్ తలొక రకంగా అంటున్నా బాధ పడేవాడినే కాదు. అంతా కలిసి నవ్వుకునే వాళ్లం!

ఆ మాటలు ఇప్పటికీ అప్పుడప్పుడు గుర్తుకొచ్చినప్పుడల్లా నాలో నేను నవ్వుకుంటూ వుంటాను.

అథవా నేను ఆడపిల్లకైనా నచ్చి నన్ను పెళ్లి చేసుకున్న తర్వాత నిక్ నేమ్స్‌తో ఏడిపిస్తే నేనేమిటి చేయటం. ఇద్దరి మధ్య గొడవే!. లైట్‌గ తీసుకుంటే పోలా?. ఏది ఏమైనా భార్య భర్తను ఆట పట్టించటం.. ఏడిపించటం... మగాడు అస్సలు టాలరేట్ చేయలేడు. కాంప్లెక్సిటీ ఫీలవుతాడు!... సరే ఎప్పటి సంగతి గురించో ఇప్పుడెందుకన్పించటంతో అక్కడితో ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టాను.

కాలేజీలో కొచ్చేక కూడా గరల్స్ నన్ను చూచి నవ్వుకునేవారు. నాతో చనువుగా మాట్లాడేటందుకు ఇష్టపడేవాళ్లు కారు. బట్ ఐ నెవ్వర్ కేర్డ్ దెమ్! ఆడపిల్లలకు సైట్ కొట్టాని నాకూ వుండేది మనసులో ఎందుకొచ్చిన గొడవలెమ్మనేసి ఆడగాలికి ఆమడ దూరంలో వుంటూండేవాడిని!

ఒక్కసారి ఆంటీ ఇంట్లో ఇనప్పెట్టె తెరిచి నోట్ల కట్టలు లెక్కించటం కళ్లబడటంతో అక్కడికెళ్లాను.

అందులో బోలెడన్ని గోల్డ్ ఆర్నమెంట్‌స వున్నయ్. 'ఒరేయ్ పార్థూ... ఇవన్నీ నీ పెళ్లానికిచ్చేవేలేరా... జాగ్రత్తగ దాచాను వీటిని!...' అన్నది.

'నా మొహానికి పెళ్లి... నాకో పెళ్లాం!... అసలీ ఆడపిల్లలను చూస్తుంటే వళ్లు మండుతోంది. వాళ్ల పట్లవేన్న అభిమానం... గౌరవం పోతోంది....' సీరియస్సయ్యాను.

'అలా ఇరిటేట్ అనకు పార్థూ ! నీ విషయంలో ఇంకా టైమ్ కలిసిరాలేదంతే...' నవ్వేసి సేఫ్ లాక్ చేసింది.

'ఆంటీ... ఇంత డబ్బు... ఇన్ని నగలు మనం ఇంట్లో పెట్టుకోవటం సేఫ్‌కాదు. బ్యాంకు లాకర్స్‌లో దాచేద్దాం...'

'దీన్ని ఓపెన్ చేయటం ఇతరులకు సాధ్యం కాదులేరా...'

'అలా అనకు ! బ్యాంక్ లాకర్స్‌ను సైతం బ్రేకోపెన్ చెయగల సమర్థవంతమైన చోరాగ్రేసరులున్నారు... టీ.వీ.ల్లో ... న్యూస్ పేపర్స్‌లో చూడటం లేదూ?...'

అద్సరే పార్థూ!... నీకు కంపెనీ విల్లా ఫ్రీగా ఇచ్చింది కదా? నువ్వు నన్నొదిలి అక్కడుంటావా?... ఇక్కడే నాతో కలిసి వుంటావా?... '

'నా మ్యారేజ్ అయ్యేదాకా ఇక్కడే! పెళ్లి అయితే గీతే... ఆ విషయం అప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకుందాలే ఆంటీ...' అనటంతో ఇద్దరం నవ్వుకున్నాం.

X X X

'ఒరే పార్థూ... రేపు సన్డే కదా? ... నువ్వు బైట ప్రోగ్రాములేమీ పెట్టుకోకు...'

'ఏం విశేషం ఆంటీ' పేపరు తిరగేస్తూ అడిగాను.

'ఈవెనింగ్ అయిదు కొట్టే సరికి మనం పెళ్లి చూపులకెళ్లాలి!. అమ్మాయి పి.జి. చేసిందట ! పిల్ల చక్కని చుక్కట !

'చక్కని చుక్కలు... అతిలోక సుందరీమణులకు నేను నచ్చుద్దా?... వెళ్లటం వేస్ట్!... గంతకు తగిన బొంతనొకదాన్ని చూడు... తాళికట్టేస్తాను...'

'అట్లాంటి పిల్లను చేసుకోవటానికి నీకేం ఖర్మరా?...'

'మనం ఇట్లా అనుకుంటునే వుంటాం... నాకు వయసుడిగిపోతుంది. అప్పుడు పెళ్లితో పనిలేదు....'

'ఆపరా నీ జోకులు!- ఆ పిల్ల ఏదో మంచి జాబ్ చేస్తోందిట! అలాంటి అమ్మాయి నీ లైఫ్ పార్ట్నర్ అయితే నను టోటల్‌గ మర్చిపోతావ్...'

'అందుకే ....నాకు రంభ కాకుండా కోతి లాంటి అమ్మాయి పెళ్ళాంగ రావాలని ఆ దేవుణ్ణి వేడుకో....'

'సరే నీ వెటకారాలు ఆపు, రేపుమనం పెళ్లి చూపులకు వెడుతున్నాం దట్సాల్....'

'పెళ్లి విషయం ప్రాక్టికల్‌గ ఆలోచిస్తే... నా ముఖాన పెళ్లి రాత లేదనిపిస్తోంది ఆంటీ...'

'అన్నీ నీకు నువ్వే వూహిచేసుకోకు! నెగెటివ్ థింకింగ్ మంచిది కాదు పార్థూ...!

'నిన్ను డిజపాయింట్ చేయటం నాకు ఇష్టం లేదు. నీమాట కాదనలేక రావటమే!- సర్లే.. రేపు అమ్మాయిని చూడటానికి.... ఐమీన్... పెళ్లి చూపులకు వెళ్లొద్దా! సరేనా?-' డ్రెస్ చేసుకుని బ్రేక్‌ఫాస్ట్ ముగించి కార్లో ఆఫీసుకు బయల్దేరాను.

ఆదివారం రానేవచ్చింది ! సాయంత్రం ఐదుకొట్టగానే అత్తయ్యతోపాటు కారు నేనే డ్రైవ్ చేస్తూ వెళ్లి ఆడపిల్లవారింటి ముందు ఆగాం!

ఇద్దరం కారు దిగగానే అక్కడ మాకోసం నిరీక్షిస్తున్న వారు ఆహ్వానం పలకటంతో లోనికెళ్లాం! ఇంతలో ఓ నడి వయస్కురాలు గబగబా మా వద్దకొచ్చి 'సుభద్రమాగారూ... ఎంత సేపైందీ వచ్చి?' అంటీని చూస్తూ ప్రశ్నించింది.

'ఇప్పుడే! మీరేం హడావిడి చెయ్యొద్దు! అలా సింపుల్‌గా కానివ్వండి! నో ఫార్మాలిటీస్...' రిప్లై ఇచ్చింది అంటీ.

'నాపేరు కావేరమ్మ ! పిల్లతల్లిని! ఒక్కతే కూతురు. తండ్రి లేని పిల్ల కాస్తంత గారాబం జాస్తి...!

ఆమె మాటలకు అడ్వొచ్చిన ఆంటీ మీ అయ్మాయికి ఫాదర్కొరే లేరు... మా మేనల్లుడికి మమ్మీ డాడీ ఇద్దరూ లేరు. పసి తనంలోనే యాక్సిడెంట్‌లో పోయారు.

అయితే అందరం ఒకే జాతి పక్షులమన్నమాట మనసులో అనుకున్నారు.

'వీడే మా మేనల్లుడు పార్థు! ఫుల్ నేమ్ పార్థసారథి! ఎం.బి.ఏ! మంచి హెూదా గల జాబ్ చేస్తున్నాడు. అదాయానికి ఆస్తిపాస్తులకేం తక్కువలేదు. నాకు పిల్లలు లేకపోవటంతో నా యావదాస్తికి వీడొక్కడే వారసుడు...' గర్వంగ చెప్పింది సుభద్రమ్మ.

'మనం తీరుబడిగా తర్వాత మాటుల్లాడుకోవచ్చు... ముందు కాఫీ, టిఫిన్ పంపిస్తాను' కావేరమ్మ అంటూండగానే 'అదిగో అఖిల వచ్చేసింది... రా అమ్మారా!... పెళ్లి కుమార్తె ఇదే...!

నన్ను ఎగాదిగా చూచిన అఖిల నా ఎదురుగా సోఫాలో కూర్చుంది.

'ఐయామ్ పార్థు ! ఎం.బి.ఏ.! బిత్రూస్ ఇంటర్నేషనల్ కంపెనీలో జి.ఎం. ను!-' నన్ను నేను పరిచయం చేసుకున్నాను. 'పార్థు కాఫీ... టీ... తగడు. అలవాటు లేదు...' అంది ఆంటీ సుభద్ర.

అవానా! నిజమా?... ఎందుకని? అంటే మేడు పూటలా భోజనమే మెక్కుతాడా ఈ వస్తాదు! అనుకుంది అఖిల మనసులో.

'పోనీ జ్యూస్ పంపతాను....' కావేరమ్మ ఆల్టర్‌నేటివ్ ప్రపోజల్ సూచించింది.

ఈ వస్తాదు డయటింగ్ ఏమైనా చేస్తునాడా స్లిమ్ అవానికి?. ముప్పొద్దులా పుల్కాలే తింటాడా ఏమిటి?. అన్పించింది అఖిలకు.

అఖిల అందచందాలకు ముగ్ధుడినైనాను. కాకి ముక్కుకు దొండపండులా వుంటుందేమో అఖిలను చేసుకుంటే... మేడ్ ఫర్ ఈచదర్‌లా వుండవేమో?.... అసలు ఇంతకూ నేను నచ్చానో లేదో?. ,చ్చితే చచ్చానే!. అందంలో అఖిలదే అప్పర్‌హేండ్! ఇద్దరం కలిసి ఎక్కడకైనా వెడితే ఆఫీసర్ ముందు బిళ్ల జవాన్‌లా కన్పిస్తానేమో?... ఏమైనా ఇంత హేడ్సమ్ పర్సనాలిటీని లైఫ్‌పార్ట్నర్ కావటం బోలెడంత రిస్క్ ఇన్వాలవ్వ్ అయివుంటందేమోని? ఒకవక్క భయం... మరోవైపు ఆశ నన్ను గందరగోళపరుస్తున్నాయ్...

ఇంతలో కావేరమ్మ ఆపిల్ జ్యూస్ తెప్పించింది!

'చూడండి సుభద్రమ్మగారూ... మాది మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ! మావారు పోయాక ఆయన పింఛను నాకొచ్చింది 'అతి కష్టంతో అఖిలను చదివించగలిగాను. మాకు ఆస్తిపాస్తులేం లేవు. మేం వుంటున్న ఈ ఇల్లు మా సొంతం అనుకునేరు. అద్దె ఇల్లు. అఖిలకు నగలంటూ ఏమీ చేయంచలేకపోయాను. వాళ్ల నాన్నగారు బ్రతికివున్నట్టయితే అఖిల పెళ్లి.. గొప్పగా కాకపోయినా తాహతుకు తగినట్టు జరిపించేవారు. ఇప్పుడు అన్ని పన్లూ నేను వక్కదాన్నే చూచుకోవాలి కదా!

ఇలీవలే అఖిలకు జాబ్‌రావటంతో కాస్త వూపిరి పీల్చుకోగలుగుతున్నాం!... ఇదీ క్లుప్తంగ మా గురించి...' కావేరమ్మ కళ్లు చెమ్మగిల్లినయ్.

'మా విషయంలో మీరేమాత్రం ఫీల్ అవాల్సిన అవసరంలేదు. మేం కట్నం ఆశించము. అమ్మాయికి నగనట్రా మేమే పెట్టతల్చుకున్నాం! మీకు అభ్యంతరం లేదంటే... పెళ్లి ఖర్చుమేమే భరించి ఘనంగ జరిపిస్తాను. ఏమంటారు...'

'మీ గొప్ప మనసు ముందు నేనెంత అక్కయ్యగారూ...' కావేరమ్మ తన ఆర్థిక స్థితికి చిన్నబుచ్చుకుంటూ మాట్లాడింది.

'మీరలా బీదమాటలు మాట్లాడటం నాకు నచ్చలేదు. ముందు అఖిల మనసులో అభిప్రాయమేమిటో మీరు తెల్సుకోండి! మా పార్థు అఖిలకు నచ్చాడనే మాట మీ నోటి వెంట అమ్మాయి నోటి వెంట రానివ్వండి.... మిగతా విషయాల గురించి మనం వర్రీ అవాల్సిన అవసరం లేనేలేదు...'

తనకు పార్థు నచ్చాడో లేదో ఇదమిద్ధంగా తేల్చుకోలేకపోతోంది అఖిల. చదువు... పెద్ద వుద్యోగం... బోలెడంత ఆస్తి వుంది. అతను ఫాటీగా వున్నా... తన అందానికి

ఫ్లాటైనట్టనిపిస్తోంది. ఇంతలో తన తల్లి ముఖంలోకి చూసింది. ఇంతకంటే గొప్ప సంబంధం మనకు రాదే అనే భావ తల్లి చూపులో గోచరించినట్టన్పించింది అఖిలకు. మగవాడు ఎ వుంటేనేం? సర్దుకుపోతే పోలే... అన్పించటంతో తలాడించింది!.

అక్కడితో అందరి డౌట్స్ క్లియరైనయ్! ముఖాలు సంతోషంతో విప్పారినయ్!

X X X

అఖిల కన్నింగ్ లేడీ అన్పిస్తోంది నామటుకు నాకు! పైకి ప్రేమ నటిస్తూ నన్ను మాత్రం మ్యారేజ్ అయి ఏడాది కావస్తున్నా ఏదో వంకతో దగ్గరికి రానివ్వకపోవటం దూరంగనే వుంచటం తీరని అసహనానికి అసంతృప్తికి గురిచేస్తోంది.

కేవలం డబ్బు హోదా అనుభవించటం కోసమే నేను అఖిలకు మనసులో ఇష్టం లేకపోయినా నన్ను పెళ్లి చేసుందనే విషయం గ్రహించగల్గుతున్నాను.

పైనా నన్ను ఈసడించుకోవడం... నిక్‌నేమ్స్‌తో ఎద్దేవ చేయటం... నామద సెటైర్లు వేయటం చూస్తూ నావళ్లు మండుతోంది.

మ్యారేజ్ అయినా ఏడాది కాలం దాటినా అఖిల తల్లి కాకపోవటం చూస్తూ సుభద్రమ్మ ఆశ్చర్యానికిలోనై ఒకరోజు నిగ్గదీసింది అఖిలను.

'అఖిలా... నాకు లైఫ్ బోరుకొడుతోంది వంటరి జీవితం విసుగుపుడుతోంది. నువ్వో బిడ్డని కని నాకిచ్చావంటే నాకు బోలెడంత కాలక్షేపం! పార్థును తండ్రి చుసినందుకు పరమానందం.. తల్లి కాగలిగినందుకు నీకు అనిర్వచనీయమైన తృప్తి కలుగుతుంది. ఇంకా డిలే దేనికి?...'

'డోన్ట్‌వర్రీ... పెద్దమ్మా.. పిల్లలను కనటం మనచేతుల్లో వుందా? అంతాదైవలీల! భగవంతుడి కృప వుంటేగానీ ఆడది తల్లి కాలేదు.. నీవు పెద్దదానివి... నీన్నీకు చెప్ప తగినదానినా?' గరిటె కాల్చి వాతపెట్టినట్టు జవాబిచ్చిన అఖిల అక్కడి నుండి తప్పుకుంది తెలివిగ !

భార్యనెలాగైనా ప్రస్నురాలిని చేసుకోవాలని అఖిల కాళ్ల దగ్గర కూర్చున్నానో లేదో కాలితో నన్ను బలంగ ఒక్కతోపు తన్నడంతో కాట్ మీదనుంచి నేలమీద పడ్డాను. 'సారీ డియర్ మీరు పడతారనుకోలేదు' స్వీట్‌గ అంది.

నా మనసు ఉక్రోషంతో వుడికి పోయింది. లేచి నాలుగు పీకుదామన్నంత కోపం వచ్చింది.

'ఇటీజ్ ఏ లవ్ గేమ్ డియర్' శ్రీకృష్ణుడిని సత్యభామ తన్నలేదూ... ఇదీ అంతే! జస్టఫర్ ఫన్...' కిలకిలా నవ్వింది అఖిల.

'అఖిల కావాలనే తన్నిందన్న సంగతి పసిగట్టలేనంత వెర్రివెధవను... చవటను కాదునేను.! - గొణుక్కున్నా.

మారుమాటాడకుండా మేడమీదికెళ్లిపోయాను.

X X X

నా భర్త ఓ జోకర్‌గాడు నా అందాన్ని చూచి పడిచస్తాడనుకో!-నా దృష్టిలో వాడొక ఎలుగుబంటి! పేరుకే వాడు నా మొగుడు, పెళ్లి అయిన క్షణం నుండి వాడినొక ఆట ఆడించేస్తున్నానంటే నమ్ము. మా శ్రీవారికి తెలీకుండా రేపు ఆఫీసుకు సెలవుపెడుతున్నాను. మనిద్దరం కలుద్దాం... బై...' సెల్ ఆఫ్ చేసింది.

అఖిల సమాధానం నాలోని అహాన్ని రెచ్చగొట్టింది.

'అవునే! నువ్వు అందగత్తెవు... భూలోకరంభవు కదా?... నీకు బోయ్‌ఫ్రెండ్‌సకేం తక్కువ?-'

'ఏంటీ... వెటకారమా?- ఇక ఆపండి మీ వాగుడు!.

'అంతమంది బాయ్‌ఫ్రెండ్స్ వుండగ నన్నెందకే పెళ్లి చేసుకున్నావ్!-' సౌమ్యంగా అడిగాను.

'నీకున్న డబ్బు స్టేటస్ నాదివ్వావాలంటే నిన్ను పెళ్లాడవలసిందేని తీర్మానించుకున్నాను. అందుకే పెళ్లాడాను. కానీ.. ఇష్ఠంలేని కాపురం చెయ్యలేకపోతున్నాను. నా అందం అడవిగాచిన వెన్నెలవటానికి మనస్కరించటం లేదు...'

'షటప్...' పెద్దగా అరిచి అక్కడ్నించి కదాలాను.

ఆంటీకి ఈ విషయం తెలీదు! తెలిస్తే? అమ్మో కొంపలు అంటుకుటయ్. అఖిల ఆడే గేమ్‌లో ఇద్దరం పావులైనందుకు గుండెపగిలేలా విలపిస్తుంది.

చేతగానివాడినని నన్ను నిలదీస్తుంది!

అందగత్తెనని విర్రీగటానికి స్వస్తిపలికిస్తే...? అప్పుడు దాని రోగం కుదురుతుంది.

దాని అతిశయం మీద దెబ్బకొట్టాలి! తప్పదు! ఇంకా దాన్ని స్పేర్ చేయటం

అనవసరం... దీని మిడిసిపాటు మీద అది కోలుకోలేని దెబ్బకొట్టాలి.

నేనంటే అభిమానం ప్రేమ లేనప్పుడు... నన్ను దగ్గరకు రానీయనప్పుడు... ఎవడో బోయ్‌ఫ్రెండ్‌గాడితో నన్ను అవమానిస్తూ చెవులారా విన్న తర్వాత కూడా ఇంకా అఖిలను 'స్పేర్' చెయ్యటం ధర్మం కాదన్పించింది.

నాలో నేనొక నిర్ణయానికొచ్చాను!

X X X

మొబైల్ అదేపనిగ రింగ్ అవుతోంది!

అప్పుడే ఆఫీసు నుంచి బాత్‌రూమ్‌లో ఫ్రెష్ అయి... వేడి కాఫీ సిప్ చేస్తూ సోఫాలో కూర్చుని టి.వీ.లో నేషనల్ జియోగ్రఫీ ఛానల్‌లో క్రూర జంతువు వేటాడే ప్రోగ్రాం చూస్తున్నాను.

అందేపనిగా రింగయ్యే మొబైల్ అందుకున్నాను. 'సార్ పార్థుగారూ! మీరు అప్పగించిన పని పూర్తి అయింది! మీ మిసెస్ అఖిల గారిపై యాసిడ్ 'దాడి' మీ డైరెక్షన్ ప్రకారమే జరిగింది. ఆమె ముఖం బాగా డేమేజ్ అయ్యింది. మళ్లీ ప్లాస్టిక్ సర్జరీ అవసరం పడుతుంది....' మేటర్ చెప్పాక మొబైల్ డిస్కనెక్ట్ అయినట్టు గ్రహించాను.

అఖిల ఇక నన్ను శత్రువుగా చూడదు! దాని అందానికి మంగళహారతి పాడినందుకు నా మనసు సంతోషించింది.

ఏమీ తెలియనివాడిలా కార్లో అఖిల ఎడ్మిట్ అయిన హాస్పిటల్ వైపు బయల్దేరాను. మనసులేని పరామర్శకు!.

నే చేసింది న్యాయమో... అన్యాయమో నన్ను పరాభవించిన ఆడదాన్ని భార్య అయినా సరే ముందు వెనుక చూడకుండా క్రూరంగా అవమానించి కసి తీర్చుకున్నాను. బ్రతికినంత కాలం వెక్కివెక్కి ఏడిచేట్టు పనిష్ చేశాను.

యాసిడ్ దాడి జరగటానికి నేనే కారణమని అఖిలకు జీవితకాలంలో తెలీదు! దట్సాల్ !!

---సమాప్తం---